## బన్సీలాల్‌పేట్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' యాత్ర



**సికింద్రాబాద్, ఆగస్టు 13 (ప్రజామంటలు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ బన్సీలాల్‌పేట్ డివిజన్ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర అత్యంత ఘనంగా నిర్వహించారు. ఐడీహెచ్ కాలనీ వద్ద ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన ఈ భారీ తిరంగా యాత్ర చాచా నెహ్రూ నగర్ వరకు కొనసాగింది. దేశభక్తి నినాదాలతో హోరెత్తిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేశారు. ఈ యాత్రకు సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వై. సురేష్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం నవీన్, బీజేపీ జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేష్, ప్రధాన కార్యదర్శి బంధం కిరణ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు అంగమూతు శ్రీనివాస్ ల పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా సుమారు 330 మంది పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. రాజు, శివరామకృష్ణ, కే.ఎం. కృష్ణ, కే. కృష్ణ, వై. శ్రీనివాస్ ముదిరాజ్, బి. పరమేష్, వెంకటపతి రాజు, శ్రీకాంత్, రఘురాం, ఏ. గణేష్, సిల్వరాజ్, డి. అరుణ్, కిరీట, సుచరిత, హిమబిందుతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా జగిత్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 13:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక టౌన్ హాల్ నుండి తాసిల్ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా, బిజెపి జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబుతో కలిసి బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి లు నేతృత్వం వహించారు. జాతీయ జెండా స్ఫూర్తితో దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటుతూ ఈ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు



**జగిత్యాల, ఆగస్టు 13 (ప్రజా మంటలు):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. నూతన పెన్షన్ల కోసం అర్హులైన వారు ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా, డయాలసిస్, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, తలసేమియా బాధితులకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్ల నుంచే, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధనతో పెన్షన్ అందిస్తామన్నారు. జగిత్యాల జిల్లాలో ప్రస్తుతం 2,18,002 మంది లబ్ధిదారులకు నెలకు సుమారు రూ. 47 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. గురుకులాల పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 1,000 కోట్ల బిల్లులు చెల్లించినట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


## ఏపీపై తెలంగాణ రక్షణ సేన నేత నవీన్ ఆరోపణలు




**హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజా మంటలు):** గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను దెబ్బతీసేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్ ఆరోపించారు. ఈ నెల 18న జరిగే జీఆర్ఎంబీ సమావేశాన్ని ఇందుకు వేదికగా చేసుకుంటున్నారని అన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు గతంలో ఇచ్చిన అనుమతులను సమీక్షించాలని ఏపీ కోరడాన్ని ఆయన తప్పుబట్టారు. తెలంగాణ ప్రభుత్వం, బీఆర్ఎస్ ఈ అంశంపై తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. కేంద్రం తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని, ఏపీ అభ్యంతరాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు అన్యాయం జరిగితే పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని నవీన్ కుమార్ హెచ్చరించారు.

## కరీంనగర్ డైరీ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**600 ఐస్ క్రీమ్ లు స్వాధీనం**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు, ఆగస్టు 13 :** జగిత్యాల పట్టణంలోనీ కరీంనగర్ డైరీ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు గురు వారం తనిఖీలు చేశారు. 600 ఐస్ క్రీములు ఏప్రిల్ మాసంలోని తేదీ తయారీ ఉండగా ఫ్రీజర్ సరిగా పనిచేయక ఐస్ క్రీములు ఫంగస్ తో పాటు మెల్ట్ కావటంతో డైరీ నిర్వాహకులను ప్రశ్నించారు. వాటిని రిటర్న్ పంపుతున్నామని సమాధానం తెలిపారు. మళ్ళీ వాటిని ఇతర ఐస్ క్రీములతో కలిసే అవకాశం ఉన్నందున వాటిని స్వాధీనం చేయడం జరిగిందని ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష తెలిపారు.

## మండల స్థాయి ప్రజావాణికి అధికారుల సిద్ధత




**హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజా మంటలు):** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో 560 మంది ఎంపీడీవోలకు మండల స్థాయి ప్రజావాణిపై శిక్షణ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంపీడీవోలపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి, ప్రజావాణిని పేదల సమస్యల పరిష్కార వేదికగా మార్చాలని చిన్నారెడ్డి సూచించారు. ఆగస్టు 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా మండల స్థాయి ప్రజావాణి ప్రారంభం కానున్న నేపథ్యంలో డెస్క్‌లు, హెల్ప్‌డెస్క్‌లు, వైద్య, తాగునీటి సదుపాయాలు, వృద్ధులు--దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలని రాష్ట్ర నోడల్ అధికారి కే. విద్యాసాగర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ సూచించారు.

## బోధన శైలిని మెరుగుపరచుకోవాలి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.రమేష్ బాబు**



**గొల్లపల్లి అగస్ట్ 13 ప్రజా మంటలు :** జగిత్యాల జిల్లా నూతన ఇంటర్మీడియట్ విద్యా అధికారిగా వై. రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ -711 ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాట్లాడుతూ నూతన సిలబస్ కు అనుగుణంగా డిజిటల్ క్లాస్ రూములు ఉపయోగించుకొని ప్రతి లెక్చరర్ తమ బోధన శైలిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి ఉచిత పుస్తకాలు, ఉచిత నోట్ బుక్స్, యూనిఫామ్, టై, బెల్టు, షూస్ వంటివి ప్రతి విద్యార్థికి అందేలా చొరవ తీసుకోవాలని, మెరుగైన ఫలితాలను సాధించుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. నర్సయ్య డా.పి.తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రాజేష్, రాష్ట్ర కార్యదర్శి విజేందర్ కోశాధికారి సిహెచ్. నరసయ్య,తదితరులు పాల్గొన్నారు..

# జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపికలు

**ఆగస్టు 20న కోరుట్లలో నిర్వహణ**

**జగిత్యాల, ఆగస్టు 13 (ప్రజా మంటలు):** తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ (సౌత్ జోన్) కోసం జగిత్యాల జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 20న నిర్వహించనున్నట్లు జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. కోరుట్లలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్ మినీ స్టేడియంలో ఉదయం 8.30 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని తెలిపారు. అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు జరుగుతాయి. అండర్-14 విభాగంలో 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్; అండర్-16లో 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్, షాట్‌పుట్; అండర్-18లో 100 మీటర్లు, 400 మీటర్లు, 1000 మీటర్లు, లాంగ్ జంప్; అండర్-20లో 100, 200, 400, 800 మీటర్ల పోటీలు నిర్వహించనున్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రాన్ని ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ కాపీ తీసుకురావాలని సూచించారు. వయస్సు అర్హత నిబంధనలకు అనుగుణంగా క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 26, 27 తేదీల్లో హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగే 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ (సౌత్ జోన్)లో పాల్గొంటారు. క్రీడాకారులు తప్పనిసరిగా గూగుల్ ఎంట్రీ ఫారం ద్వారా ఆగస్టు 19లోగా దరఖాస్తు చేసుకోవాలని, గడువు అనంతరం ఎంట్రీలు స్వీకరించబడవని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. పాల్గొనే అభ్యర్థులకు భోజనం, తాగునీటి సదుపాయాలు కల్పించబడవని, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన ప్రయాణ ఖర్చులను క్రీడాకారులే భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9959523772 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఎలేటి ముత్తయ్య రెడ్డి తదితరులు క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 15న దేశ వ్యాప్తంగా గ్రామ సభలు

**ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం**

**చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల, సెల్ నం: 9948133539 :** భారత దేశ స్వాతంత్ర దినోత్సవం రోజైన ఈ నెల 15న దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ మినిస్ట్రీ సహాయ కార్యదర్శి ముక్త శేఖర్ ఈ నెల 11 న అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఉత్తర్వుల లేఖ సంఖ్య డి.ఓ.నం. యం.11015/39/2025 - పాలసీ ద్వారా ఈ ఉత్తర్వులను దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల స్పెషల్ చీఫ్ సెక్రెటరీలకు, అదనపు చీఫ్ సెక్రెటరీలకు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు, పంచాయతీ రాజ్ కార్యదర్శులకు ఈ ఉత్తర్వుల ఆదేశాలను పంపించి ఆయా రాష్ట్రాలలో గల అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో తప్పని సరిగా ఆగస్ట్ 15న గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు.



హిందీ, ఇంగ్లీష్ భాషలలో అన్ని వివరాలను తగిన కార్టూన్ లతో, ఫోటోలతో ప్రత్యేకంగా తయారు చేసిన ఎజెండా అంశాలతో కూడిన 90 పేజీలతో పత్రాలతో ఈ ఆదేశాలను జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన ఆదేశాలను పాటిస్తూ అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి పంచాయతీ రాజ్, గ్రామీణ ఉపాధి శాఖల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేస్తూ అన్ని జిల్లాల కలెక్టర్ లకు ( పంచాయతీ విభాగాలకు) అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు సూచించారు. స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, గాంధీ జయంతి తదితర ఉత్సవాల సందర్భంగా కూడా ప్రతి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నూతనంగా వచ్చిన ఆదేశాల ప్రకారం గ్రామ సభలు నిర్వహించడానికి దేశ వ్యాప్తంగా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, కృషి చేస్తున్నారు..

## బీర్ పూర్ లో ఎసిబి దాడులు

**రెడ్ హ్యాండెడ్ గా చిక్కిన గిర్ధావర్**





**బీర్ పూర్ / జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు, ఆగస్ట్ 13:** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న రెవెన్యూ శాఖ గిర్ధావర్ రాహుల్ ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితురాలికి సంబంధించిన 12 గుంటల భూమిని సాదాబైనామా ద్వారా భూభారతి కార్యక్రమంలో పట్టా చేయించేందుకు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియలో ఎంక్వైరీ చేసి రిపోర్ట్ సమర్పించాల్సిన గిరిధావర్ రాహుల్... ఎంక్వైరీ విషయంలో జాప్యం చేస్తూ బాధితురాలి నుంచి రూ. 50 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. చివరకు రూ. 40 వేలకు ఒప్పందం కుదరగా... ముందుగా రూ. 30 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రాహుల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి వెల్లడించారు.

## జె ఈ ఈ మెయిన్స్ లో సత్తా చాటిన మద్దునూర్ యువకుడు

**ఐఐటీ సూరత్ సిఎస్ఈ లో ప్రవేశానికి అర్హత**



**బుగ్గారం / జగిత్యాల జిల్లా, ప్రజా మంటలు, ఆగస్టు 13:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల తిరుపతి గౌడ్ కుమారుడు ఉయ్యాల శ్రీమాన్ గౌడ్ జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మంచి ర్యాంక్ సాధించారు. ఈ ప్రతిభతో ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ సూరత్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్సి) కోర్సులో ప్రవేశానికి అర్హత సాధించారు. శ్రీమాన్ గౌడ్ సాధించిన ఈ విజయం కుటుంబ సభ్యులతో పాటు మద్దునూర్ గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. పట్టుదల, కృషి, లక్ష్యసాధనతో ముందుకు సాగితే ఉన్నత విజయాలు సాధించవచ్చని శ్రీమాన్ గౌడ్ నిరూపించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు శ్రీమాన్ గౌడ్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువులో మరింత రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో దేశానికి సేవలందించే స్థాయికి ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు.

## అవయవ దానం అత్యుత్తమ సేవా కార్యం

**నిమ్స్ ప్రొఫెసర్ శ్రీభూషణ్ రాజు**

**పీఐబీ లో అవయవదానంపై వర్క్షాప్**




**సికింద్రాబాద్,ఆగస్ట్ 13 (ప్రజామంటలు):** అవయవ దానం అనేది మరొకరికి నూతన జీవితాన్ని ప్రసాదించే అత్యంత పవిత్రమైన పుణ్యకార్యమని నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి, జీవన్‌దాన్ (సొట్టో) అధిపతి డాక్టర్ శ్రీభూషణ్ రాజు పేర్కొన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కవాడిగూడ లోని సీజీఓ టవర్స్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో 'వార్త' మీడియా వర్క్‌షాప్ గురువారం జరిగింది. "అవయవ దానం - అపోహలు, నిజాలు" అనే అంశంపై నిర్వహించిన ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించడంలో, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకమైనదని ఆయన స్పష్టం చేశారు. మన దేశంలో అవయవాల అవసరానికి, లభ్యతకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. మరణానంతరం చేసే అవయవ దానం ద్వారా ఎంతో మందికి పునర్జన్మ ఇవ్వవచ్చని, వైద్య సాంకేతికత ఎంత పెరిగినా అవయవాలను తయారు చేయలేమని, దాతల ఉదారతే ప్రాణాధారమని తెలిపారు. స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి పద్ధతులు, ప్రభుత్వ చట్టాలు, జీవన్‌దాన్ (సొట్టో) వంటి వ్యవస్థల ద్వారా పారదర్శకంగా అవయవ మార్పిడి జరుగుతోందని వివరించారు. అవయవ దానంపై ప్రతి కుటుంబంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, పలువురు జర్నలిస్టులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## ఎల్.రమణను కలిసిన పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన్



**సికింద్రాబాద్, ఆగస్టు 13 (ప్రజామంటలు):** మాజీ మంత్రి, బీసీ సంక్షేమ ఉద్యమ నేత ఎల్. రమణను గురువారం బౌద్ధనగర్ డివిజన్ మాజీ వార్డు మెంబర్, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ రంగంలో మరింతగా ఎదగాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని మంద జగన్‌ను ఎల్. రమణ సూచించారు. ప్రజా సేవతో పాటు రాజకీయంగా మంచి గుర్తింపు సాధించాలని, నిబద్ధతతో ముందుకు సాగాలని ఎల్. రమణ ఇచ్చిన సూచనలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని మంద జగన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి రాజు, చింతకింది మల్లేష్, గబ్బెట రాజు, కొండ కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా

**సీఎం రేవంత్ సెన్సేషనల్ కామెంట్స్**

**క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం భూమిపూజ**

**కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన**

**పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్న సీఎం**



గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. పేదల రుణం తీర్చుకునేందుకు అవకాశం వచ్చిందని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నేతలపై రేవంత్ రెడ్డి పలు విమర్శలు గుప్పించారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారని మండిపడ్డారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ. 12వేల కోట్లు చెల్లించామని వివరించారు. మహిళా సంఘాలకు రూ. 65వేల కోట్ల బ్యాంకు లింకేజీ లోన్లు అందించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని గుర్తుచేశారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న సీఎం, రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు 1000 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. శిల్పారామం వద్ద రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళాశక్తి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని, ఓ వైపు వాటన్నింటినీ తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమం వైపు దృష్టి పెడుతున్నామని సీఎం తెలిపారు. "క్షుద్ర పూజల కోసం కొందరు కర్ణాటకకు పోయారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్ర పూజలు చేశాడు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడుతుంది. రాష్ట్ర బాగు కోసం నా సంకల్పం అందుకే వర్షాలు పడుతున్నాయి. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాననన్నారు. ఈ విషయంలో తనదీ పూచీ అని చెప్పారు. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారన్న సీఎం, సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని'అని సీఎం తెలిపారు.

